ఇంటింటా సంక్షేమ పథం

- వైఎస్సార్‌సీపీ 'తూర్పు' సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ
- 12వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం'



12వ వార్డు నేతాజీనగర్‌లో వృద్ధురాలికి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, తదితరులు

ఆరిలోవ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 12వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. స్థానిక కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో చినగదిలి ప్రాంతం నేతాజీనగర్, దీన్‌దయాల్‌పురంలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు ద్వారా పొందిన లబ్ధి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఎంపీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ పేదలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న ఆలోచనతో సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి మంచి పథకాలు ప్రవేశ పెట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో మూడు జిల్లాల ఎస్సీ సెల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, జిల్లా ఇన్‌చార్జి బోని శివరామృష్ణ, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, జ్యోతి ప్రకాష్, మురళీ, శ్రావణి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మోహనరూపా.. జ్యోతి స్వరూపా..





ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి, భజన చేస్తున్న అయ్యప్ప మాలధారులు

- మిన్నంటిన అయ్యప్ప శరణుఘోష
- వైభవంగా పడిపూజ

మద్దిలపాలెం : అయ్యప్ప పడి పూజా మహోత్సవం కొత్త వెంకోజీపాలెం శ్రీగౌరి జ్ఞాన లింగేశ్వరాలయం లోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో గురువారం ఘనంగా జరిగింది. కొత్త వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పడి పూజా మహోత్సవాన్ని ఉదయం 5 గంటలకు లక్ష్మీ గణపతి హోమంతో ప్రారంభించారు. అనంతరం అయ్యప్పస్వామిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల భాస్కరశర్మ భక్తులతో పడిపూజా అభిషేకాన్ని సాయంత్రం 6 గంటలకు నిర్వహించారు. శబరిమలలో మండల పూజ మహోత్సవం ప్రారంభంలో భాగంగా ఇక్కడ వచ్చే నెల 26వ తేదీ వరకూ మండలం పూజ జరుపుతామని సంఘం అధ్యక్షుడురమణ తెలిపారు. ముందుగా అయ్యప్ప స్వామిని పల్లకిలో ఊరేగించారు. అనంతరం పడి పూజా మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు శరణ ఘోషతో మార్మోగించారు. పడి పూజా మహోత్సవంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని, స్వామి దర్శించుకున్నారు.



పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ

క్లుప్తంగా

కల్యాణ మండపం ఆధునికీకరణకు శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేటలోని కల్యాణ మండపం ఆధునికీకరణ పనులకు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ గురువారం శంకస్థాపన చేశారు. రూ.25 లక్షలతో ఈ కల్యాణ మండపాన్ని ఆధునికీకరిస్తున్నట్లు ఎంపీ తెలిపారు. సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో విశాఖను అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, వార్డు అధ్యక్షుడు వాడమోదుల గణేష్, సూరాడ దాసు, బెహరా వసంత, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



తోటగరువు ఎంపీపీ స్కూల్‌లో మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు తోటగరువు ప్రాథమిక పాఠశాలలో బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశరావు మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానం పొందుతారన్నారు. పాఠ్య పుస్తకాలతో పాటు కథల పుస్తకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్, ఉపాధ్యాయుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో వీఎంసీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, తదితరులు

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల బాక్సింగ్ పోటీల్లో ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. 48 నుంచి 51 కేజీ విభాగంలో కళాశాల బీకామ్ విద్యార్థి సీహెచ్.పవన్‌కుమార్ వెండి పతకం సాధించగా.. 90 నుంచి 93 కేజీల విభాగంలో కళాశాల బీఎస్సీ విద్యార్థి ఎస్.సాయికుమార్ రజత పతకంతో మెరిశాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరావు, కళాశాల డైరెక్టర్ సుంకర రాహుల్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

సీపీఎం నాయకుడు శంకరయ్యకు ఘన నివాళి



శంకరయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం : ఇటీవల మృతి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, తమిళనాడు సీపీఎం తొలి తరం నాయకుడు ఎన్.శంకరయ్య మృతికి నగర సీపీఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పిఠాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో గురువారం శంకరయ్య చిత్ర పటానికి 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు, జి.వి.ఎన్.చలపతి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.మణి, వి.కృష్ణారావు, యు.ఎస్.ఎన్.రాజు, ప్రదీప్, రమణ, త్రినాథ్, కుమారి తులసీరాం పాల్గొన్నారు.

ఆనంద్‌మార్గ్‌లో పండ్ల పంపిణీ



ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో బాలురకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ: విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి జన్మదిన వేడుకలు గురువారం 10వ వార్డు ఇందిరానగర్ ఆనందమార్గ్ ఆశ్రమంలో ఘనంగా జరిగాయి.

మాజీ కార్పొరేటర్ జగ్గుపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పాల్గొని ఇక్కడ బాలురతో ప్రార్థన చేయించారు. స్వామీజీ సేవలు గురించి పిల్లలకు వివరించారు. అనంతరం పిల్లలకు పండ్లు, పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమం స్వామీజీ సొమ్యానంద్ అవదూత, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారమ్

వెబ్ ఆఫ్ సైన్స్‌పై సదస్సు



జస్వంత్‌ని సత్కరిస్తున్న ఆచార్య వెంకటేశ్వర్లు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్ట్రీమ్ లైనింగ్ రీసెర్చ్ యూజింగ్ వెబ్ ఆఫ్ సైన్స్ అంశంపై సదస్సు నిర్వహించారు. ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సదస్సులో క్లారిఫైడ్ సంస్థ ప్రతినిధి జస్వంత్ వెబ్ ఆఫ్ సైన్స్ వినియోగం, ఉపయోగాలు వివరించారు. పరిశోధకుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వెబ్ ఆఫ్ సైన్స్‌ని సరళంగా వినియోగించే విధానాలను విశదీకరించారు. ఈ సదస్సులో విద్యార్థులు, పరిశోధకులు, గ్రంథాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పరిశోధకుల సందేహాలకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా జస్వంత్‌ను గ్రంథాలయ అధికారి ఆచార్య వెంకటేశ్వర్లు సత్కరించారు.

ఆలోచనల్లో స్పష్టత అవసరం

ఏయూ క్యాంపస్: ఆలోచనలో, చేసే పనిలో స్పష్టత కలిగి ఉండడం అవసరమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ సూచించారు. అంతర్జాతీయ తత్వశాస్త్ర దినోత్సవం సందర్భంగా ఏయూ తత్వశాస్త్ర విభాగంలో గురవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి వ్యక్తి మానవత్వంతో జీవనం సాగించాలని సూచించారు. మన చుట్టూ ఉన్న వ్యక్తులను గౌరవించడం, సమదృష్టితో చూడడం ఎంతో ప్రధానమన్నారు. ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ నైతికత, విలువలకు అధిక ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. తత్వశాస్త్ర విభాగాధిపతి ఆచార్య వెంకటరావు మాట్లాడుతూ భారతీయ తత్వశాస్త్రాన్ని ఒక సబ్జెక్టుగా అన్ని కోర్సులలో అందించాల్సిన అవసరం ఉందన్నారు. విశ్రాంత ఆచార్యులు కె.ఆర్.రజిని మాట్లాడుతూ జ్ఞానానికి మూలంగా తత్వశాస్త్రం నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కృష్ణయ్య, ఆచార్య కె.రమేష్ బాబు, పరిశోధకులు, విద్యార్థులు, విశ్రాంత ఆచార్యులు పాల్గొన్నారు.

నాక్ ర్యాంక్‌పై హర్షాతిరేకాలు

- ఏయూలో కొనసాగుతున్న సంబరాలు
- శుభాకాంక్షలు, అభినందనల వెల్లువ



వీసీకి శుభాకాంక్షలు తెలుపుతున్న మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ



ఏయూలో కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్న రెక్టార్ సమత, రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: జాతీయ స్థాయిలో ఏయూ అత్యుత్తమ నాక్ ర్యాంకు సాధనతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వర్సిటీ విభాగాల్లో ఆచార్యులు, విద్యార్థులు సంబరాలు చేసుకుంటున్నారు. కెమికల్ ఇంజినీరింగ్ విభాగ సమావేశం మందిరంలో గురువారం నిర్వహించిన నాక్ విజయోత్సవంలో రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ జాతీయ విద్యా సంస్థలకు దీటుగా ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధి సాధిస్తోందన్నారు. ఐక్యూఏసీ సమన్వయకర్త ఆచార్య డి.లలిత భాస్కరిని ఆచార్యులు అభినందించి, సత్కరించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్.అవధాని, ఆచార్య ఎం.శశి,ఆచార్య పి.కింగ్, ఆచార్య చిట్టిబాబు పాల్గొన్నారు.

- ఆంధ్ర విశ్వవిద్యాలయం నాక్ ఏ డబుల్ ప్లస్ గ్రేడ్ సాధించడంపై వర్సిటీ ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. ఏయూలోని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద కేక కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, తదితరులు పాల్గొన్నారు.
- ఏయు విద్యా విభాగాధిపతి ఆచార్య షారాన్‌రాజు ఆధ్వర్యంలో విద్యార్థులు పరిపాలన భవనం వద్దనున్న కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి పూల మాలలు వేశారు. అనంతరం ప్లకార్డులతో ఏయూ మెయిన్ గేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీవోఎస్ డాక్టర్ నాగరాజ కుమారి, విభాగ ఆచార్యులు సిబ్బంది పాల్గొన్నారు. ఐఏఎస్ఈ భవనం వద్ద విద్యార్థులతో కలిసి నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ ఆచార్య శోభశ్రీ, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- ఏయూ నాక్ ర్యాంకింగ్‌లో అత్యుత్తమ స్థానం సాధించడంపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి నడింపల్లి కృష్ణంరాజు హర్షం వ్యక్తం చేశారు. వీసీని కలిసి అభినందించారు. 20వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు మువ్వల సురేష్‌తో పాటు పలువురు నాయకులు వీసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
- నాక్ ర్యాంకింగ్‌లో ఏయూ అత్యున్నత స్థానాన్ని సాధించడంపై వీసీని పలువురు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య జగన్నాథరావు, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ పి.ఎస్.అవధాని, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.రెహమాన్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, డీసీపీలు కె.శ్రీనివాసరావు కె.ఆనందరెడ్డి తదితరులు వీసిని కలిసి అభినందనలు తెలిపారు.
- నాక్ ర్యాంకు సాధనకు కృషి చేసిన వీసీ ప్రసాద్‌రెడ్డిని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ అభినందించారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఎస్ఎఫ్ఎస్ విద్యార్థుల ప్రతిభ



ఎస్ఎఫ్ఎస్ విద్యార్థులకు బహుమతి అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

బీచ్ రోడ్డు: జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఎస్ఎఫ్ఎస్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్‌లో ఈ నెల ఒకటి నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఫలితాలను గురువారం వెల్లడించారు. ఎస్ఎఫ్ఎస్ విద్యార్థులు కృత్రిమ మేధస్సుతో రూపొందించిన చంద్రయాన్-3 నమూనా సందర్శకులను అమితంగా ఆకర్షించడంతో ప్రథమ బహుమతి పొందింది. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్ విజయకుమార్ అభినందించారు.

పిల్లల్లో నేత్ర సమస్యలపై అవగాహన అవసరం

ఆరిలోవ: ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో బాలల నేత్ర సంరక్షణ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 19వ తేదీ వరకు జరగనున్నట్లు ఆస్పతి కంటి వైద్య నిపుణుడు డాక్టర్ స్నేహాల్ గణత్ర తెలిపారు. ఈ మేరకు గురువారం పిల్లల తల్లిదండ్రులకు ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో మయోపియా(హ్రస్వ దృష్టి), హైపర్ మెట్రోపియర్(దూరదృష్టి), అస్టిగ్మాటిజం(ఒక పైపునకే దృష్టి సారించడం) తదితర సమస్యలు తలెత్తుతాయన్నారు. వీటి వల్ల పిల్లలు రోజువారీ పనులు చేసేటప్పుడు ఇబ్బంది పడుతుంటారన్నారు. చదువుతున్నప్పుడు తలనొప్పి, కళ్లకు అలసట రావడం జరుగుతుందన్నారు. అలాంటి సమస్యలను తల్లిదండ్రులు గమనించాలన్నారు. వారోత్సవాలులో భాగంగా పిల్లల తల్లిదండ్రలకు అవగాహన కోసం ఈనెల 19న బీచ్ రోడ్డులో కాళీమాత ఆలయం వద్ద బాలల నేత్ర సంరక్షణ వాక్ నిర్వహించనున్నట్టు తెలిపారు.

వృత్తి విద్యా కోర్సులకు ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: జన శిక్షణ సంస్థాన్, వరల్డ్ టీచర్ ట్రస్ట్(జగద్గురు పీఠం) సంయుక్తంగా తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో పలు వృత్తి విద్యా కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ప్రారంభిస్తున్నట్లు జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 45 ఏళ్ల వయసు గల మహిళలు అర్హులని చెప్పారు. ఈ నెల 22లోగా తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపు తమ పేర్లు, వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. కంప్యూటర్ కోర్సు(3 నెలలు), హ్యాండ్ ఎంబ్రాయిడరీ(3 నెలలు), బ్యూటీషియన్ (3 నెలలు) వంటి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. వీటిని విజయవంతంగా పూర్తిచేసుకున్న వారికి పరీక్షలు నిర్వహించి, గుర్తింపబడిన సర్టిఫికెట్లు అందజేయనున్నామని సత్యదేవ్ తెలిపారు.

ఎఫ్‌సీఐకి వితరణ

ఆరిలోవ: రూరల్ తహసీల్దారు కార్యాలయం సమీపంలో ప్రభుత్వ ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో శిక్షణ పొందుతున్న డిఫెన్స్ ఉద్యోగులు సహాయం అందించారు. ఇక్కడ 14 వారాలు శిక్షణ కోసం చేరిన వారికి కొద్ది రోజుల్లో కోర్సు పూర్తి కానుంది. దీంతో వారంతా కలిసి ఇన్‌స్టిట్యూట్‌కు అవసరమైన మైక్రో ఒవెన్, మిక్సీ గ్రైండర్‌ను గురువారం ప్రిన్సిపాల్ కె.వి.రమణకు అందించారు. దీంతో ప్రిన్సిపాల్ డిఫెన్స్ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాకారిణి జ్యోతికి ఎంపీ ఎంవీవీ అభినందన

ఎంవీపీ కాలనీ: ఆసియా క్రీడల్లో రజత పతకం సాధించిన ఎర్రాజీ జ్యోతిని గురువారం విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ లాసన్స్ బే కాలనీలోని తన కార్యాలయంలో అభినందించారు. ఇటీవల జ్యోతి ఆసియా క్రీడల్లో 100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకం, 200 మీటర్ల పరుగులో రజత పతకం సాధించింది. వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో కాంస్య పతకంతో మెరిసింది. ఈ నేపథ్యంలో జిల్లా అథ్లెటిక్ సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఆమెను సత్కరించి, అభినందించారు.

రూ. 10 భోజనానికి 200 రోజులు



రూ. 10 భోజనాలు అందజేస్తున్న సంస్థ సభ్యులు

మహారాణిపేట : రౌండ్ టేబుల్ సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ స్వామి వివేకానంద సంస్థ సహకారంతో ప్రభుత్వ ప్రసూతి (ఘోష) ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు పది రూపాయలకే భోజనాలు అందించే కార్యక్రమం నేటికి 200 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ సంస్థ సభ్యులు మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు, వారి సహాయకులకు నారాయణ సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రతి రోజు పది రూపాయలకే భోజనాలు అందిస్తున్నామన్నారు. రౌండ్ టేబుల్ సభ్యులు విక్రాంత్ హనుమంతు, సందీప్ రెడ్డి, మక్సూద్ అహ్మద్, కల్యాణ్ ఆదిత్య, విరాజ్ పోలిశెట్టి, అరవిందు, రవి నల్లమోతు, భారత్ కొల్లపూడి, వివేకానంద సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



జగదీష్ మృతదేహం

గోపాలపట్నం: మనస్తాపంతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శివనగర్‌లో జరిగింది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీవీఎంసీ 53వ వార్డు శివనగర్‌లో గంటాల జగదీష్(52) అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సయంలో తలుపులు గడియ వేసుకుని ఫ్యాను హుక్‌కు ఉరి వేసుకుని మృతిచెందాడు. కొద్ది సేపటి తరువాత కుటుంబ సభ్యులు గమనించి తలుపులు తెరిచి చూశారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు సివిల్ కాంట్రాక్ట్ వర్క్స్ చేసేవాడు. పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లి ఇటీవలే తిరిగొచ్చాడు. 15 రోజుల కిందటే శివనగర్‌లోని అద్దె ఇంట్లోకి మారారు. అప్పటి నుంచి ఇంట్లో ముభావంగా ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. జగదీష్ మృతికి ఆర్థిక ఇబ్బందులు కారణమై ఉండొచ్చని చెబుతున్నారు. మృతుడికి భార్య శ్రీదేవి, ఇద్దరు కుమార్తెలు పూజిత, వికాసిని ఉన్నారు.

కేవీలో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ

దొండపర్తి: స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న కేంద్రీయ విద్యాలయ్‌లో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 10, 12 తరగతి డ్రాపవుట్ అయిన నిరుద్యోగులకు పూర్తి వివరాల కోసం శుక్ర, శనివారాల్లో స్కూల్‌లో ఉన్న కంప్యూటర్ ఫ్యాకల్టీని కలవాలని చెప్పారు. కోర్సుల్లో నమోదు కోసం అభ్యర్థులు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ ఫొటోతో కేంద్రీయ విద్యాలయ్‌లో సంప్రదించాలని సూచించారు.

రామాయణంపై క్విజ్



క్విజ్ పోటీ విజేతలతో నిర్వాహకులు

సీతంపేట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విశాఖ పౌర గ్రంథాలయం, విశాఖ సాహితి, అఖిల భారతీయ సాహిత్య పరిషత్ సంయుక్త నిర్వహణలో గురవారం ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో రామాయణంపై క్విజ్ పోటీ నిర్వహించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. ఈ పోటీలో 11 టీమ్‌లు పాల్గొన్నాయి. విశాఖ సాహితి ఉపాధ్యక్షురాలు కందాళ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ ఇటువంటి పోటీలు యువతలో రామాయణ, మహాభారత గ్రంథాలపై అవగాహన వస్తుందన్నారు. అఖిల భారతీయ సాహిత్య పరిషత్ కార్యదర్శి శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ జ్ఞానార్థులకు గ్రంథాలయాలు జ్ఞాన కాంతిని పంచే సూర్యుడు వంటివని, గ్రంథాలయంలో అడుగుపెడితే ప్రపంచమంతా కనుల ముందు ఉన్నట్టేనన్నారు. డి.వి.సూర్యారావు మాట్లాడుతూ యువత సాహిత్యంలో ఆసక్తి చూపి మన భాషకు మేలు చేయాలన్నారు. అనంతరం పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు దుర్గారాణి, విద్యార్థులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

షాదీఖానా, ఈద్గా నిర్మాణానికి వినతి



స్టేట్ మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ముస్లిం నాయకులు

మహారాణిపేట : రాష్ట్రంలో ప్రతి జిల్లా, మండలానికి షాదీఖానా, ఈద్గా, ఉర్దూ రెసిడెన్షియల్ స్కూలు, కాలేజీ ఏర్పాటు చేసి, ఉర్దూ టీచర్ల నియామకం చేయాలని నూర్ బాష ముస్లిం నాయకులు కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఏపీ స్టేట్ మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్ బాష ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ షేక్ బాబ్జీ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు. ముస్లిం శ్మశాన వాటికి కోసం ఒక ఎకరం నుంచి రెండెకరాల వరకు స్థలం మంజూరు చేసి, ప్రభుత్వ నిధులతో ప్రహరీ నిర్మించాలని కోరారు. మసీదులకు ప్రభుత్వ సబ్సిడీతో విద్యుత్, మంచినీటి సదుపాయం కల్పించాలన్నారు. 11 డిమాండ్లతో వినతిపత్రం సమర్పించారు. కమిషన్‌ను కలిసిన వారిలో రాష్ట్ర మహిళా గౌరవ అధ్యక్షురాలు షేక్ మున్నీ, షేక్ నాగూర్, షేక్ మదీనా తదితరులున్నారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



స్టాల్ టోకెన్ అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు గురువారం ఈవో కొండబాబు ఆధ్వర్యంలో డ్రా తీసి రైతులకు టోకెన్లు అందజేశారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.